నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
5 | నిజామాబాద్, శుక్రవారం 2 మే 2025 | ADILABAD NIRMAL

ఇందిరమ్మ ఇండ్లలోనూ ఫెయిల్

కాంగ్రెస్ నాయకులు, వాళ్ల బంధువులకే ఇండ్ల కేటాయింపు

- గ్రామాల్లో సర్వేలు, గ్రామసభలను అడ్డుకుంటున్న జనం
- పేదలను కాదని నాయకులకు ఇవ్వడంపై మండిపాటు
- ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల ధర్నాలు, నిలదీతలు
- గుడిసెలు, రేకుల షెడ్డుల్లో ఉంటున్నోళ్లు అనర్హులా?
- లీ సర్వే చేసి ఎంపిక చేయాలంటూ పేదల డిమాండ్

కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ మండలం ఊటు సారంగపల్లి గ్రామ పంచాయతీ ముందు ఇందిరమ్మ ఇండ్లకు అర్హులను ఎంపిక చేయాలని ధర్నా చేస్తున్న గ్రామస్తులు(ఫైల్)

మంచిర్యాల జిల్లా రహదారులపై ధర్నా చేస్తున్న ఎల్లక్కపేట గ్రామస్తులు

ఇందిరమ్మ ఇల్లు రాలేదని

పేద యువకుడి ఆత్మహత్యాయత్నం

కోటపల్లి, మే 1 : ఇందిరమ్మ ఇండ్ల అర్హుల జాబితా నుంచి కాంగ్రెస్ నాయకులు, అధికారులు తన పేరును తొలగించి అన్యాయం చేశారని మనస్తాపంతో మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం రొయ్యలపల్లికి చెందిన కుమ్మరి రవీందర్ బుధవారం రాత్రి పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మంచిర్యాల ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. కాంగ్రెస్ నాయకులకు అనుకూలంగా ఉన్నవారికి, ఆర్థికంగా ఉన్న వారికే ఇందిరమ్మ ఇండ్లను కేటాయించారని రవీందర్ ఆరోపించాడు. నిరుపేదలమైన తమకు అన్యాయం చేశారని వాపోయాడు.

మంచిర్యాల ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్న కుమ్మరి రవీందర్

బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలో 34 వార్డులు ఉన్నాయి. ఇందులో 2,941 మంది ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇండ్లు ఉన్న కాంగ్రెస్ పార్టీ లీడర్లు వేరే దగ్గరున్న ఖాళీ స్థలాలు చూపిస్తూ ఇండ్లు లేని వారిగా దరఖాస్తు చేసుకున్నారు. లబ్ధిదారుల జాబితాల్లో ఇండ్లు లేని పేదలకు బదులు ఇండ్లు ఉన్న కాంగ్రెస్ లీడర్లు, మాజీ ప్రజాప్రతినిధుల పేర్లు రావడం స్థానికంగా దుమారం రేపుతోంది. ఓ వార్డుకు చెందిన మాజీ ప్రజాప్రతినిధిసహా బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ పీఏ గడ్డం దుర్గా ప్రసాద్ పేరు ఇందిరమ్మ ఇండ్లకు ఎంపికైన లబ్ధిదారుల జాబితాలో ఉండడంపై సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం జరిగింది. జనం నుంచి విమర్శలు రావడంతో ఈ ఇద్దరూ జాబితాలో నుంచి తమ పేర్లను తొలగించాలంటూ బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్‌ను కలిసి వినతి పత్రాలు ఇచ్చారు. లబ్ధిదారుల జాబితాలో చాలా మంది కాంగ్రెస్ లీడర్ల పేర్లు ఉన్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పార్టీ నాయకులకే ఇండ్లు ఇచ్చుకునేట్లు ఉంటే.. తమ నుంచి దరఖాస్తులు ఎందుకు తీసుకున్నట్లు అని మండిపడుతున్నారు.

చెన్నూర్ నియోజకవర్గంలోని సుద్దాల గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల కమిటీ ఆధ్వర్యంలో 42 మందిని లబ్ధిదారులుగా ఎంపిక చేశారు. దీనిపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో నిరుపేద కుటుంబాలు 300 మంది ఉంటే వారెవనికి కాకుండా ఇప్పటికే ఇండ్లు ఉన్న వారిని ఎంపిక చేశారంటూ గ్రామస్థులు పంచాయతీ కార్యదర్శిని గ్రామసభలో నిలదీశారు. కిష్టంపేట గ్రామంలో 1100 దరఖాస్తులు రాగా, తమకు అనుకూలంగా ఉన్న 70 మందినే ఎంపిక చేశారు. ఎల్లక్కపేటలో 70 దరఖాస్తులు రాగా కేవలం నలుగురిని ఎంపిక చేశారు. దీనిపై ఎల్లక్కపేట కాలనీ వాసులు రోడ్డుపై ధర్నా చేశారు. కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉన్నోళ్లకు, డబ్బులు ఇచ్చినోళ్లకే ఇండ్లు ఇచ్చారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

మంచిర్యాల జిల్లా కానిపేట మండలం లంబాడీతండా (ధర్మారావుపేట)లో ఇందిరమ్మ ఇండ్ల సర్వేను అడ్డుకున్న గ్రామస్తులు

మంచిర్యాల, మే 1(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కాంగ్రెస్ సర్కారు ప్రతిష్ఠాత్మకంగా చెప్పుకుంటున్న ఆరు గ్యారెంటీల్లో ఒక్కటైన ఇందిరమ్మ ఇండ్ల పథకం ఫెయిల్ అయింది. కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఆ పార్టీకి అనుకూలంగా ఉన్న వారికి లేదా ఇందిరమ్మ కమిటీలోని కాంగ్రెస్ పార్టీ నాయకులకు, డబ్బులు ఇచ్చినోళ్లే ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులుగా ఎంపిక అవుతున్నారు. ఈ రెండు ఉదాహరణలే కాదు.. రాష్ట్రవ్యాప్తంగా రోజు ఇందిరమ్మ ఇండ్లకు అనర్హులు, కాంగ్రెస్ లీడర్లను ఎంపిక చేశారంటూ ప్రజలు తిరగబడుతున్నారు. గ్రామాల్లోకి సర్వేలు, సభలకు వెళ్లిన అధికారులను నిలదీస్తున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఈ తరహా నిలదీతలు, నిరసనలు ఎక్కువైపోయాయి. బెల్లంపల్లి నియోజకవర్గ కేంద్రంతోపాటు కాసిపేట మండలంలోని లంబాడీతండా (ధర్మారావుపేట్) గ్రామంలో సోమవారం గ్రామస్తులు అధికారులను నిలదీశారు. కాంగ్రెస్ నాయకులు, వారి బంధువులే ఎంపికైన లబ్ధిదారుల్లో ఉన్నారంటూ ఇందిరమ్మ ఇండ్ల సర్వేను అడ్డుకున్నారు. దీంతో చేసేది ఏం లేక అధికారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. చెన్నూర్ నియోజకవర్గంలో సుద్దాల, కిష్టంపేట, ఎల్లక్కపేటతోపాటు ఎర్రగుంటపల్లి గ్రామస్తులు సోమవారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులు కాంగ్రెస్ నాయకులు, వారి బంధువులనే ఎంపిక చేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయం చేయాలంటూ డిమాండ్ చేశారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరిమెరి మండలంలోని దేవాపూర్ గ్రామానికి చెందిన జాదవ్ గజానంద్, రాథోడ్ యశ్వంత్‌రావు అనే వికలాంగులు పోయిన వారం ఎంపీడీవో ఆఫీసు ఎదుట బైఠాయించారు. అన్ని రకాలుగా అర్హులుగా ఉన్న తమను ఎందుకు ఎంపిక చేయలేదంటూ నిరసన తెలిపారు. అనంతరం కార్యాలయ సిబ్బందిని వినతి పత్రం ఇచ్చి వెళ్లారు. బెజ్జూర్ మండలంలోని సారంగపల్లి, సలుగుపల్లి గ్రామస్తులు అనర్హులను ఎంపిక చేశారంటూ పంచాయతీ కార్యాలయం ఎదుట, రోడ్డుపై ధర్నా చేశారు. పలు గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న పేదలు తాము ఉంటున్న గుడిసెలు, తాత్కాలిక ఇండ్లను చూపిస్తూ.. మమ్ములను ఎందుకు ఎంపిక చేయలేదంటూ నిలదీస్తున్నారు.

రేకుల షెడ్డులో ఉంటున్న ఇల్లు లేదు

మాది నిరుపేద కుటుంబం. రెక్కాడితే గానీ కడుపు నింపుకోలేను. కూలీ నాలీ చేసి సంపాదించిన కొద్ది పాటి సొమ్ముతో రేకుల షెడ్డు వేసుకున్నా. అలాంటి నన్ను ఇందిరమ్మ ఇంటి కోసం ఎంపిక చేయలేదు. గతంలో ఇల్లు ఇచ్చినోళ్లకే మరోసారి ఇల్లు ఇస్తున్నరు. ఇది ఎక్కడి న్యాయమో అర్థం అయితలేదు. మా ఊరిలో ఎవ్వరిని అడిగిన చెప్తరు. ఇందిరమ్మ ఇల్లును నేను పూర్తి అర్హురాలిని అని. కావాలంటే మరోసారి సర్వే చేసైనా సరే నన్ను ఎంపిక చేయాలి. **- భూక్య సమత, ధర్మారావుపేట, కాసిపేట**

నిరుపేదలం మాకు ఇయ్యలే..

మాది ఎర్రగుంటపల్లి గ్రామం. మాకంటూ సొంత ఇల్లు లేదు. ఊరిలో ఇల్లు ఉన్న వారినే ఇందిరమ్మ ఇండ్లకు ఎంపిక చేశారు. కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉన్నవాళ్లకు, వారి బంధువులకే ఇండ్లు రాస్తున్నారు. మాకు భూములు లేవు. మా తాతలు కట్టిన పాత ఇంట్లో ఉంటున్నాం. గోడలు కూలిపోడానికి సిద్ధంగా ఉన్నాయి. మాది నిరుపేద కుటుంబం. కష్టం చేసి బతికేటోళ్లం. ఉన్న రోజు కూలీ పనులకు పోతం. లేని రోజు పస్తులు ఉంటం. తప్పని సరి పరిస్థితి వస్తే అప్పులు చేసి అవసరం తీర్చుకుంటం. మేం ఇద్దరం ఆడపిల్లలమే. మా నాన్నకు మా పెళ్లిళ్లు చేయడం కూడా పెద్ద భారమే. ఇల్లు సక్కగా లేదు. ఇందిరమ్మ ఇల్లు ఇస్తే కొంచెం అప్పు చేసైనా ఇల్లు కట్టుకుంటం. ప్రభుత్వం మా వంటి పేదలకు ఇండ్లు ఇయ్యాలి. **- సాగే సమ్మక్క, ఎర్రగుంటపల్లి, చెన్నూర్.**

పూరి గుడిసెలో ఉంటున్నా..

పూరి గుడిసెలో ఉండే నన్ను ఇందిరమ్మ ఇల్లుకు ఎంపిక చేయలేదు. ముందు ఇందిరమ్మ లిస్టులో పేరు వచ్చింది. ఇప్పుడేమో లిస్టులో నా పేరు తీసేశారు. అడిగితే నువ్వు అర్హుడివి కాదు అంటున్నారు. పూరి గుడిసెలో ఉంటూ కూలీ చేసుకుని బతికే నేను ఎందుకు అర్హుడిని కాదు. నాకు ఇండ్లు మంజూరు చేయకపోవడం దారుణం. ఇప్పటికే ఇల్లు ఉన్న వాళ్లకే ఇల్లు మంజూరు చేస్తున్నారు. పాత ఇందిరమ్మ ఇల్లు ఉన్న వాళ్లను కూడా మరోసారి ఎంపిక చేశారు. అర్హులైన నిరుపేదలైన మా వంటి పూరి గుడిసెల్లో ఉండే పేదలకు ఇండ్లు ఇవ్వాలి. సర్వే చేసి నిజమైన అర్హులను గుర్తించాలి. **- హట్కూర్ రాజు, ధర్మారావుపేట, కాసిపేట**

ఘోర రోడ్డు ప్రమాదం

ఒకరు మృతి, 12 మందికి గాయాలు..

ఇచ్చోడ, మే 1 : మండల పరిధిలోని కోకస్‌మన్నూర్ ఎక్స్ రోడ్డు వద్ద జాతీయ రహదారిపై గురువారం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకున్నది. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. నిర్మల్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు 64 మంది ప్రయాణికులతో ఆదిలాబాద్‌కు వస్తున్నది. దీని వెనుక ఆటోలో నేరడిగొండ మండలంలోని కుంటాల గ్రామానికి చెందిన ప్రయాణికులు ఆరుగురు ఆదిలాబాద్‌కు శుభకార్యానికి వెళ్తున్నారు. రహదారిపై పశువులు అడ్డుగా రావడంతో పశువులను తప్పించేందుకు ఆర్టీసీ డ్రైవర్ బ్రేక్ వేశాడు. దీంతో బస్సు వెనుకల ఉన్న ఆటో, ఎక్స్‌ఎల్ ద్విచక్రవాహనం, ఆయిల్ లారీ వేగంగా వచ్చి ద్విచక్రవాహనం, ఆటో, బస్సును ఢీకొట్టింది. అలాగే ఆయిల్ లారీ రోడ్డుపై ఉన్న నాలుగు పశువులను ఢీకొట్టి బోల్తా పడింది. బస్సులో ప్రయాణిస్తున్న భోరజ్ మండలంలోని మాండగడ గ్రామానికి చెందిన మేకల భీమక్క(60) తీవ్రంగా గాయపడి ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందింది. బస్సు డ్రైవర్ ఎండీ అజీజ్, ప్రయాణికులు పవర్ పూల బాయి, లక్ష్మి, మౌనిక, అలాగే ఆటో డ్రైవర్ షేక్ జహీర్, షేక్ జావిద్, రేష్మా, సఫియా బేగం, సహిస్తా రుక్సాన, జుబియా ఫిర్దోస్, ఎక్స్‌ఎల్ ద్విచక్రవాహనంపై ఉన్న పవర్ నాందేవ్, పవర్ విక్రమ్ గాయాల పాలయ్యారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు.

క్షతగాత్రులను పరామర్శించిన ఎమ్మెల్యే

రోడ్డు ప్రమాదం ఘటన స్థలాన్ని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పరిశీలించారు. రిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. వైద్యులతో మాట్లాడుతూ మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. బాధితులు ధైర్యంగా ఉండాలని, అందుబాటులో ఉంటానని ధైర్యం చెప్పారు. ఎమ్మెల్యే వెంట రిమ్స్ రాథోడ్ జైసింగ్, వైద్యులు, నాయకులు ఉన్నారు.

ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

మేకల భీమక్క(ఫైల్)

దేవుళ్లపై ఓట్లేసి నిరసన తెలుపుతున్న ముక్రా(కే) గ్రామస్తులు

దేవుళ్లపై ఓట్లేసి నిరసన

ఇచ్చోడ, మే 1 : దేవుళ్లపై ఓట్లేసి తమకు రుణమాఫీ కాలేదని, రైతు భరోసా రాలేదని ముక్రా(కే) గ్రామస్తులు నిరసన తెలిపారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలోని శివాలయం ఆలయం వద్ద దేవుళ్లపై ఓట్లేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్ని పథకాలు ప్రజలకు అందుతున్నాయని అబద్ధాలు చెప్తున్నారన్నారు. ఆరు గ్యారెంటీలు బోగస్ అయ్యాయన్నారు. ముక్రా(కే) గ్రామంలో సగం మంది రైతులకే రుణమాఫీ అయిందని, కొంత మందికే రైతు భరోసా వచ్చిందని, ఇంకా చాలా మందికి రుణమాఫీ కాలేదని, రైతుభరోసా రాలేదన్నారు. కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్ బంద్ అయిందని, తులం బంగారం ఇంకా ఎవరికి వస్తలేదన్నారు. స్కూటీలు ఒక్కరికి కూడా ఇవ్వలేదని, రూ.4 వేల పింఛన్ వస్తలేదని, కొత్త పథకాలు దేవుడెరుగు ఉన్న పథకాలు ఇస్తలేరని మండిపడ్డారు. రైతు భరోసా ప్రతి ఒక్కరికి వేస్తునామ్, ప్రతి పథకం ప్రజలకు ఇస్తున్నామని అబద్ధాలు మాట్లాడుతున్నారన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో రేవంత్ రెడ్డి రాష్ట్రంలో ప్రచారంలో తిరుగుతూ దేవుళ్లపై ఓట్లేసి 15 ఆగస్టు లోపు అందరికీ రుణమాఫీ చేస్తానని చెప్పి మాట తప్పారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి రైతుకు రుణమాఫీ చేయాలని, ప్రతి ఒక్కరికి రైతు భరోసా వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గాడ్గే మీనాక్షి, మాజీ ఎంపీటీసీ గాడ్గే సుభాష్, రైతులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి

జైనథ్, మే 1 : రేణుక సిమెంట్ పరిశ్రమ భూముల విషయంలో గతంలో హంగామా సృష్టించిన స్థానిక ఎమ్మెల్యే ఇప్పుడెందుకు రైతులకు న్యాయం చేయలేకపోతున్నారని జోగు రామన్న ప్రశ్నించారు. రేణుక సిమెంట్ కచ్చితంగా ప్రారంభమవుతుందని, ఎంపీ, ఎమ్మెల్యే సీసీఐ పరిశ్రమ ప్రారంభం దిశగా కేంద్రంపై ఒత్తిడి పెంచాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధితోపాటు పరిపాలన పరమైన సౌలభ్యం కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం నూతన మండలాలను ఏర్పాటు చేసిందన్నారు. సాత్నాల మండల ఏర్పాటుపై హర్షం వ్యక్తం చేస్తూ మండలంలోని రాంపూర్ గ్రామంలో అభినందన సభ నిర్వహించారు. కార్యక్రమ ముఖ్య అతిథులకు గ్రామస్తులు డప్పు చప్పుళ్ల మధ్య స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో గండ్రత్ రమేశ్, మెట్టు ప్రహ్లాద్, చందాల రాజన్న, దేవన్న, భరత్, శ్రీరామ్, వసంత్, వెంకటి, ఆనంద్ రావ్, తాహెర్, బట్టు సతీష్ పాల్గొన్నారు.

జోగు రామన్నను సన్మానిస్తున్న గ్రామస్తులు

సీఎంఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలి

కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ చైన్‌గేట్, మే 1 : కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ సమావేశ మందిరంలో గురువారం సాయంత్రం అధికారులు, రైస్‌మిల్లర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సీఎంఆర్ సరఫరాలో ప్రతి మిల్లరూ గడువులోపు లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ ప్రక్రియలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇక నుంచి రైస్ మిల్లర్లకు ధాన్యాన్ని కేటాయించాలంటే వారు తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలకు లోబడి ధాన్యాన్ని ప్రభుత్వానికి అందజేస్తామన్న ఒప్పందం చేసుకుంటేనే ధాన్యం కేటాయిస్తామన్నారు. రైస్‌మిల్లులో హమాలీల సంఖ్యను పెంచి మిల్లింగ్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, ఖైంసా ఆర్డీవో కోమల్‌రెడ్డి, డీఎం సివిల్ సప్లయ్ సుధాకర్, ఎల్డీఎం రామ్‌గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

సమయపాలన పాటించాలి

నిర్మల్ అర్బన్, మే 1 : పోలీసులు సమయపాలన పాటించి విధులు నిర్వహించాలని ఎస్పీ జానకి షర్మిల అన్నారు. గురువారం ఎస్పీ కార్యాలయం నుంచి పోలీసు సిబ్బందితో ఆమె సెట్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పోలీస్ స్టేషన్‌లో ఉపయోగించే అన్ని అప్లికేషన్‌లు అప్‌డేట్ చేస్తూ ఉండాలని సూచించారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలని మెన్, ఉమెన్ అనే తేడా లేకుండా విధులు నిర్వహించాలని ఆదేశించారు. మైనర్ డ్రైవింగ్ డ్రంక్ అండ్ డ్రైవ్‌పై దృష్టి సారించాలన్నారు. ఈసెట్ కాన్ఫరెన్స్‌లో ఏఎస్పీ అవినాశ్, ఏఎస్పీ రాజేశ్ మీన పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్పీ జానకి షర్మిల